# ఎలిగే పెద్దోళ్ళూ నలిగే సిన్నోళ్లూ

నిద్దరలో ఏదో సెడ్డ కలవరం వచ్చినట్టు ఉలిక్కిపడి మేలుకొన్నాడు అంకడు. పక్కన్నె పుల్లి, నాగి, బక్కోడు నోళ్ళు తెర్సుకోని నిద్ర బోతాండారు. కింద పాత జంకానమూ, గోనె సంచి పట్టాలూ పర్సుకున్నారు. కప్పుకొనేదానికేంలేదు. దోమలు పొగ మాదిరి సుట్టుకొని కుడతాంటే, కాళ్ళతో తన్నుకుంటా, సేతుల్తో కొట్టుకుంటా అట్టనే నిద్రబోతాండారు. దీప మార్పినట్టు లేదు. నూనె అయిపోతాందేమో కొట్టుకలాడతాంది.

"దీప మారిపి పండుకో, పొద్దుపోయింది!" అని పుల్లి సెప్పింది.

"ఆరుపుతాలే! నువ్వు పండుకో!" అని బీడీ ముట్టించుకున్నాడు. తాగుతా తాగుతాండగానే నిద్దర పట్టింది. నిద్దర్లో ఏం కలవర మొచ్చింది? ఏందో గ్యాపక ముండదు. ఉలిక్కిపడినట్టు మేలుకొంటాడు. మల్లా నిద్దర పట్టిసావదు ఎంతసచ్చినా!

అంకడు కూకోని బీడీ కోసం సూసినాడు. సేతికీ మూతికీ అంటని తుంట బీడి అయిపోయింది. దాన్ని సూపుడేలూ బొటికెన ఏల్తో పట్టుకొని కసికొద్దీ కొట్టం గోడకు తగిలేట్టుగా ఇసిరి కొట్నాడు. గోడమీద, కొట్టుకలాడ్తున్న దీపం బొమ్మ కనపడతాంది. ఎగిరి ఎగిరి పడతాంది, నేలమీద పడి పొర్లి పొర్లి దొర్లుతా వున్నెట్టుంది, సేతులెత్తి దండం పెడతా వున్నెట్టుంది, తట్టుకోలేక మీదికి వురకబోతాన్నెట్టూ, నిలబడలేక ఇరుసుకొని పన్నెట్టూ...... అది సరిగ్గా ఆరోజు ఓబిగాడు తన్నుకలాడినట్టుంది. ఇంగ సూల్లేక అంకడు దీపం మలిపి వచ్చి పండుకున్నాడు. గోడమీద దీపం లేదిప్పుడు, కొట్టంనిండా సీకటి, ఈ సీకట్లో ఆరోజు పట్టపగలు జరిగింది ఇంగా బాగా కనిపిస్తోంది. ఇది నిద్దర్లో వచ్చే సెడ్డ కలవరం కాదు, నిద్దర కూడా రానియ్యని సెడ్డ నిజం.

అంకడు దీపాన్ని ఆర్పినట్టే కండ్లల్లో మండుతున్న ఆ గ్యాపకాన్ని

ఆర్పాలనుకున్నాడేమో - రెండు సేతుల్తో గట్టిగా కండ్లు నలుపుకొన్నాడు. అదట్టా ఆరిపొయ్యేది కాదు, మండుతానే ఉంది. ఓబిగాడు నిలువునా మండిపోతాండాడు. పొలంలో దుక్కి పెడ్డల్లో పడి దొర్లుతాండాడు. తట్టుకోలేక అట్టా ఇట్టా పరుగెత్తుతాండాడు. ఏడుస్తాండాడు. ఏం దేందో తిడ్తా, అరుస్తా ఉండాడు. ఎర్రని మంటల్లో నల్లగా కాలిపోతా ఉండాడు.మనిషి నిలువునా కాలిపోవడం ఎన్నడూ సూల్లేదు. మనిసిని నిలువునా తగలబెట్టి, నగుతా సూస్తా......... మనుసు లుంటారని ఎప్పుడూ అనుకోలేదు.

ఆ రొండూ ఒక్కసారే సూసినాడు. అంతా అయిపోయినాక, బొగ్గైపోయిన ఓబిగాన్ని సేలోనే గుంత తీసి బూడ్సిపెట్టినాక, అందరూ టాక్టేరెక్కి మాట్లాడుకుంటా ఊళ్ళోకి బయల్దేరినారు! ఏం మాట్లాడుకున్నారని- ఓబిగాన్ని తిట్టుకుంటానైనా మాట్లాడుకున్నారా? కాదు, రాజకీయాల గురించి మాట్లాడుకున్నారు. ఓబిగాని మీద ముందు కిర్సనాయిలు పోసి అగ్గిపుల్ల గీసిన నాగసుబ్బారెడ్డికి యీసారి ఎమ్మెల్లే సీటు రావడం గురించి మాట్లాడుకున్నారు. సీటొస్తే, ఎవరెవర్ని పట్టుకోవాల్నో, పెచార మెట్టా సేయాల్నో మాట్లాడుకున్నారు. తామంతకుముందు ఏ పాపమూ సెయ్యనోళ్ళమాదిరి, పొలం సూసి వస్తాండేవాళ్ళ మాదిరి మాట్లాడుకున్నారు. ఎవరూ సూడకుండా దొంగగా తలకాయ తిప్పి సే న్దిక్కు సూస్తే...... ఏమీ లేదు!

అంతకు ముందక్కడ ఏ గోరం జరిగినట్టు లేదు. అంతవరకూ అక్కడ భూమి దున్నుతావుండిన ఓబిగాడు ఇప్పుడు భూమిలోకి పోయినాడు. మడక లాగుతావుండిన ఎద్దులు మారుకు అంతదూరంలో నిలబడిపోయినాయి. భూమి మాట్లాల్లేదు, ఎద్దులు మాట్లాల్లేవు. సేనిగట్టు సెట్టు మీదుండే ఏ కాకన్నా చూసిందేమో కాని కాకా అని అరిస్తే తుపాకులు కూడా ఉండాయి, కాల్చి సంపుతారని బయపడిందేమో మల్ల - కాకి గూడా అర్సలేదు. మాట్లాడలేనియి మాట్లాడకపోతే అట్ట పోనియ్యి మాట్లాడడం వచ్చిన, మాట్లాడవలసిన ఓబిగాని పెండ్లాం, పిల్లలూ మాట్లాడకపోయిరి. ఓబిగాడేమయిందీ వాళ్ళకు తెలక కాదు. సంపినోళ్లే సెప్పినారు. ఎట్టా? ఓబిగాని పెండ్లాం ఎంగటినీ, కొడుకుల్నీ ఈడ్సకొచ్చినారు. నాగసుబ్బారెడ్డి నాయిన రంగారెడ్డి ఎంగటి కెదురుగ్గా నిలబడి, "ఏమే! నీ మొగుడు నా ఇంటిమీద కొచ్చి నన్నూ నా కొడుకునూ తిట్టిపోతాడా! వాన్ని కాల్చి బూడ్దిసెయిచ్చకుండా ఊరకుంటా ననుకుంటివా? ఇప్పుడేం జేస్తావే? వాడు పురుగుల మందు తాగిసచ్చినాడని సెప్పకపోతే, నీ కొడుకుల క్కూడా వానికి పట్టిన గతే పడ్తాది, జాగర!" అన్నాడు.

ఎంగటి అట్టనే సెప్పింది. ఎంగటి ఎట్టసెప్పినా ఆ ఊళ్ళో వాళ్ళకు ఏం జరిగిందీ తెల్సు. సంసినోళ్ళు మేమే సంపినామని సెప్పినా ఆ సంగతి ఎవరూ బైటికి సెప్పలేకపోయినారు.

ఎంగటి ఎక్కడ కనపడినా నాగసుబ్బారెడ్డి "ఎప్పుడొస్తావే? " అనడిగేవాడు. ఆ రోజు నలుగురూ సూస్తూండగా ఎంగటి సెయ్యివట్టి గుంజి, నానా రోత మాటలూ మాట్లాడినాడు. "దాన్ని పిల్చక రమ్మంటే పిల్చకరావేరా నా కొడకా? అదీ, నువ్వూ ఒకే కులపోల్లనా? అందుకేనా? అదిగాదురా, దాని మొగుడు మనకు అవతలోని పక్క అందుకే దాన్ని వొదలకూడదు!" అని అంతకుముందు రెండు మూడుసార్లు తనతో అన్నాడు. అంతవరకూ ఎంగటి మొగున్తో సెప్పినట్టు లేదు. ఆరోజు అవమానం తర్వాత సెప్పినట్టుంది.

ఓబిగాడు ఎంటనే రంగారెడ్డి ఇంటిదగ్గరి కొచ్చినాడు. "నీ కొడుకు నా పెండ్లాన్ని రమ్మని రోజూ పిలుస్తాండాడంట! ఇంగోసా రట్ట పిల్చినాడంటే వాన్ని నరికిపారేస్తా నని సెప్పు!" అని పోయినాడు.

ఓబిగాడు అంత ధైర్యం సేస్తాడని ఎవరూ అనుకోలేదు. వర్ధనరెడ్డి తనకు ఆపుగా ఉంటాడని అనుకున్నాడేమో!

ఓబిగాడేమైనదీ సంపినోళ్లు ఊళ్లో కొచ్చేతలికే అవతలోళ్లకు తెల్చిపోయింది. అంతకు ముందురోజు ఓబిగాడు రంగారెడ్డింటి మీదికి పోయింది ఊళ్లో అందరికీ తెల్సు. 'ఇంగ ఈన్ని బతకనియ్యరు' అనుకున్నారు. అనుకున్నట్టే అయింది. ఓబిగాడు సేలో లేడు. ఎద్దులు మాత్తరమే ఉండాయని ఎవరో వర్ధనరెడ్డి ఇంట్లోసెప్పినారు. ఎద్దుల్ని ఇంటికి తోలుకొచ్చుకున్నారు.

"ఇదే మనకు శాన్స్! కేసు పెట్టిచ్చి అబ్బా, కొడుకుల్ని జైలుకు పంపుద్దాం!" అని వర్ధనరెడ్డి ఊగినాడంట.

వాళ్ళనాయిన రాజారెడ్డాపినాడంట. "దేనికైనా ముందూ ఎనకా సూసుకోవాల! ఓబిగాడు మనపక్కోడే! అయితే, వా డేంటోడు? మాదిగోడు. మాదిగోడై ఉండీ ఒక రెడ్డింటి మీది కొచ్చి నరుకుతా నన్నాడంటే, రేపు వాడు మనింటిమీదికి మాత్తరం రాడా? వాళ్లకూ, మనకూ కచ్చలుంటే మనం మనం సూసుకోవాల. అంతేగానీ...." అనే సరికి వర్ధనరెడ్డి అదీ నిజమేననుకుని గమ్మున ఉండిపోయినాడంట. ఇదంతా తాను ఇంటాండగా రంగారెడ్డింట్లో మాట్లాడుకున్నారు. రంగారెడ్డి నగిరెడ్డి మొ..........కు పుట్టినోడు ఎప్పుడైనా అట్నే అంటాడు. మాదిగోనికి పుట్టుంటేనే మాదిగోనిపక్కకు పోయేది!" అన్నాడు.

తను మల్ల మాదిగోనికే పుట్నాడు. మాదిగోని పక్కనుండలా. మాదిగోని నిట్టనిలువునా కిర్సనాయిలు పోసి తగలబెట్టి సంపిన రెడ్డి పక్కనున్నాడు. ఓబిగాడు నాలుగేండ్ల కిందటి

వరకూ తన సవాసకాడు. ఇద్దరూ గోలిగుండ్లు ఆడుకున్నారు. ఏటికి నీళ్లొచ్చినప్పుడు ఇద్దరూ కల్సి ఈతాడినారు. స్లేపలూ, ఎంగ్రకాయలూ పట్టుకొని కాల్చుకొని తిన్నారు. ఎంగటి గూడాఎప్పుడూ "అంకన్నా! అంకన్నా!" అని పిల్చేది. అట్టాటిదాన్ని నాగసుబ్బారెడ్డి సెయ్యి పట్టి గుంజుతాంటే సూసినాడు! బూతులు తిడ్తాంటే ఇన్నాడు!

ఆకిరికి ఓబిగాన్ని ........ అదీ సూస్తా దూరంగా నిలబడుకోనున్నాడు. మల్ల. ఆయ నెవరో ఏదో పత్రికెకు పన్జేస్తాడట! ఆయన మాదిగోనికి పుట్నోడు గాదు. ఓబిగాన్ని పలానావాళ్లు సంపినారని ఆకాశరామన్న ఉత్తర మేస్తే కడపనుంచీ వచ్చినాడంట. రంగారెడ్డి, నాగసుబ్బారెడ్డి ఆయన్తో నగుతా నగుతా మాట్లాడినారు. "మేం జెప్పడ మెందుకు? వాని పెండ్లాన్నే అడగండి!" అన్నారు. ఆయనట్టా పోతానే తిట్టడం మొదలుపెట్నారు. "యాన్నో వుండే నా కొడుక్కు ఈడి కెందుకంట? ఆ మాదిగోడు ఈని అన్నా తమ్ముడా?"

ఆ పత్రికాయన అడిగినప్పుడు కూడా పురుగుల మందు తాగి సచ్చినాడనే సెప్పిందంట ఎంగటి. ఆయనింగా ఏయేయో అడిగితే, సెప్పలేక ఏడ్సిందంట. ఓబన్నను సంపినట్టె అనిపిస్తోందనీ, వాళ్ల బయం వల్ల ఆమె అబద్దం సెపుతా ఉందనీ, ఇదంతా ఇశారణ జరిపిచ్చాలనీ ఆయన పత్రికలో రాసినాడంట. రొండోసారి ఆయన కడపనుంచీ మోటార్ సైకిలు మీ దొచ్చి, తిరిగిపోతాండేటప్పుడు లారీ కింద పడిసచ్చిపోయినాడు. అదెవరు సేయిచ్చిందీ అందరికీ తెల్సు.

"వాళ్లకూ, మనకూ కచ్చలుంటే మనం మనం సూసుకోవాల" అన్నాడు రాజారెడ్డి.

"అంతే మల్ల!" అన్నాడు రంగారెడ్డి.

వాళ్ల కచ్చలు వాళ్లే సూసుకునేట్టయితే, వాళ్ల సుట్టూ ఈ మాల మాదిగెవాళ్లనూ, ఇతర సన్నకులాలోళ్లనూ ఎందుకు పెట్టుకొన్నట్టు? మాదిగోని ఇసయం వచ్చేతలికి మనం మనం సూసుకోవాల అంటాండారు! రంగారెడ్డి, రాజారెడ్డి ఎన్నడన్నా ఎదురెదురుగా నిలబడి కొట్లాడుకొన్నారా? ఓబిగాడూ, తనూ కొట్టుకొన్నారు. అసలు మాదిగోళ్లలోనే వర్దనరెడ్డి మనుసులూ, నాగసుబ్బారెడ్డి మనుసులూ ఉండారు. వాళ్ల కచ్చలు వాళ్లే సూసుకునేట్టయితే, ఈళ్ళలో కచ్చె లెట్టొచ్చినట్టూ? ఏ ఊళ్లో సూసినా, ఏ జిల్లాలో సూసినా రెడ్డికి రెడ్డికీ, నాయునికీ నాయునికో, లేకపోతే రెడ్డికీ, నాయునికో కచ్చలు. వాళ్ల కచ్చలూ, వాళ్లూ లచ్చనంగా ఉంటే నడిమద్దెన మాలా, మాదిగె, బీదా బిక్కి ఈళ్లు నాశనమయితాండారు!

"అరె! ఆ మీటింగులో వాళ్లు సెప్పినట్టే అనుకుంటా ఉండానే!" అనుకున్నాడు

అంకడు. ఇంతకుముందు ఇట్లా అనుకోలేదు మల్ల. రెడ్డింటిమీదికి పోయి అంత మాటనడం తప్పు అనుకున్నాడు. పత్రికాయన్ను సంపుతే వాళ్లు అనుకున్నట్టే "ఆయన సంగతి ఆయన సూసికోక ఈ ఊళ్లో జరిగిన సంగతి ఆయన కెందుకు" అనుకున్నాడు. నాగసుబ్బారెడ్డి ఎంట గొడ్డెండ్లూ, ఈటెలూ తీసుకునిపోతాంటే సూసే వాళ్లు బయపడి పక్కను పోతాంటే. రొమ్ము ఇర్సుకొన్నాడు!

ప్రొద్దుటూర్లో జరిగిన ఆ మీటింగ్ను సెడగొట్టమని లారీనిండా తమను పంపిచ్చినాడు నాగసుబ్బారెడ్డి. సారాను రద్దు చేయిచ్చింది వాళ్లేనంట. ఆ రద్దువల్లే మైతుకూర్లో నాటుసారా తాగి ఎనిమిది మంది సచ్చింది అన్నాడు. ఆ మైతుకూర్లో నాటుసారా అమ్మిన మనిసి యీయన మనిసే మల్ల! అయితే, అప్పు డిట్టనుకోలా! సారా మానిపిచ్చింది వాళ్లేనంటే శానామందికి కోపమొచ్చింది. అల్లరి జెయ్యాల్సిందే అనుకున్నారు. తీరాపోతే, అక్కడ ఎక్కడ సూసినా పోలీసోళ్లే!

"పోలీసులు మన్దిక్కే, వాళ్ళ నేం జేసినా సూసీ సూడనట్టుంటారు!" అన్నాడు నాగసుబ్బారెడ్డి.

అక్కడేమో వాళ్లట్ట లేరు "మీటింగు జరక్కపోతే పత్రికల్లో ఏస్తారు కనుక, ప్రభుత్వానికి సెడ్డ పేరొస్తాది. జరిగేతట్టు సూడండి." అని వాళ్లకు ఆడర్లు వచ్చినాయంట. అందుకని గట్టిగా ఉండినారు. సేసేదిలేక, మీటింగుకు వచ్చినోళ్లమాది రుండినారు. మీటింగులో ఒక్కొక్కరూ ఎంత బాగా సెప్పినారో! కోర్టులో 'అంతా నిజమే సెబుతా' అని పెమానం సేసి అంతా అబద్దాలు సెబుతారు. వాళ్లు అట్టాంటి పెమానాలు యేయీ సెయ్యకుండానే అంతా నిజాలు సెప్పినారు.

ఈ రెడ్డికీ, ఆ రెడ్డికీ ఇరోద మేర్పడి ఇద్దరూ తుపాకులు సంపాయిచ్చుకోని జనాన్ని ఎంటబెట్టుకుని కూనీలు సేసుకుంటే ఏమయితాది? పోలీసులు ఇద్దరికీ సలాం సేస్తారు. ఇద్దరికీ కంట్రాకట్లూ, పదవులూ దొరుకుతాయి. ఇద్దరూ ఆస్తులు పెంచుకుంటారు. మద్దెలో వాళ్ళలోనో, ఈళ్ళలోనో ఎవరన్నా సచ్చినా - అంటే సంపుకున్నా, పోయినోడు పోతే ఉన్నోళ్ల ఆస్తి పెరుగుతాది. ఒకేల సచ్చినోడు ఏఎమ్మెల్లేనో అయితే అది వాని కొడుక్కొస్తాది. లేదా, పెండ్లాని కొస్తాది. ఆ రెడ్డితట్టో, ఈ రెడ్డితట్టో సేరి సంపేదీ, సచ్చేది ఎవరు? మాల, మాదిగె, బలిజ, బోయ ఇట్టాటి సిన్నా సితక కులాలోళ్లు. ఈ ళ్లు సంపినా, సచ్చినా ఈళ్ల కుటుంబాలు దిక్కులేనియే. అంటే ఏంది? వాళ్లు ఎన్నటికీ సెడిపోరు, ఈళ్లు యెప్పటికీ బాగుపడరు. ఎక్కడన్నా సూసుకో ఇద్దరు పెద్దోళ్ల మద్దెన కచ్చలున్నాయంటే.

ఇద్దరూ ఇంగా పెద్దోళ్లయినట్టే లెక్క. వాళ్ల పలుకుబడి ఐదరాబాదు దాకా పోయి, అక్కడ సెలేసినట్టు గూడుకట్టుకుంటాది.

ఎక్కడదాకో ఎందుకు? రంగారెడ్డి, రాజారెడ్డి వాళ్ల అయాంలోకన్నా కొడుకుల అయాంలో ఇంగా సంపాయిచ్చినారు. సంపాయిచ్చే కొద్దీ వాళ్ల దుడుకుతనం పెరిగింది. ఊళ్లో ఆలూ మొగుండ్ల కొట్లాట కాన్నుంచీ అన్నదమ్ముల బాగాల్దాకా, ఆస్తి తగాల్దాకా, ఆ యప్పో, ఈ యప్పో పంచాయితి సెయ్యాల్సిందే. ఓబిగాని ఇసయంలో రంగారెడ్డికి రాజారెడ్డి ఆపొస్తే, మునిగాడి ఇసయంలో రాజారెడ్డికి రంగారెడ్డి సాయపడినాడు. ఐదరాబాదులో వర్ధనరెడ్డికి తెల్సిన ఎమ్మెల్లే ఇంట్లో దొంగతనం జరిగిందంట. ఆ ఎమ్మెల్లే ఇంట్లో పనిసేసేది మునిగాని తమ్ముడు. వాన్ని తీసుకపోయి ఆడ ఇడ్సింది వర్ధనరెడ్డే. దొంగతనం వాడే సేసినాడో, దొంగతనం వానిమీది కొస్తాదని బయపన్నాడో మల్ల, వాడు పారిపోయినాడు. వాన్ని తను తీసకపోయి ఇడిసే సెడ్డపేరు తెచ్చినాడు కనుక, వాడు దొరికేదాకా ఈన్ని తీసకపోయి తన్నుండని మునిగాన్ని పోలీసులకు పట్టిచ్చినాడు వర్ధనరెడ్డి. యాన్నో తమ్ముడు దొంగతనం సేసినాడని, ఈన్ని ఈడ పట్టకపోయెదెట్టా అనుకోకుండా పోలీసోళ్లు వాన్ని పట్టకపోయి లోపలేసినారు. పోలీసోళ్లు మామూలుగానే దొరికి నోళ్లనల్లా కొట్టేవాళ్లు, పైగా వర్ధనరెడ్డి కొట్టమని సెప్పె! ఇంగేముంది - ఆ కొట్టడంలో మునిగాడు సచ్చిపాయె.

వాన్ని సంపినాక, రాత్రికి రాత్రి జీపులో యేసుకోని రంగారెడ్డి ఇంటికొచ్చినారు. రంగారెడ్డి జరిగింది బైట పెట్తాడని వర్ధనరెడ్డే అనుకున్నాడో, పోలీసోళ్లే అనుకున్నారో తెల్దు గానీ అట్టా వచ్చినారు. రంగారెడ్డి అటు వర్ధనరెడ్డినీ, ఇటు పోలీసోళ్లనూ ఆదుకున్నాడు. మునిగాని శవాన్ని పక్కూరి పొలిమేరకాడ పడేసి రమ్మన్నాడు. వాడు ఆరితేర్న దొంగనీ, పక్కూరికి దొంగతనానికి పోతే జనం పట్టుకోని కొట్నారనీ, ఆ దెబ్బలకు వాడు సచ్చిపోయినాడనీ సెప్పిచ్చినాడు. మునిగా డెట్ట సచ్చిందీ అందరికీ తెల్పు. వాడు దొంగో, కాదో కూడా తెల్పు. అయితే, ఇద్దరు పెద్దోళ్ల కెదురు నిలబడి ఎవరు సెప్తారు? మునిగాడు యేయో సిన్న సిన్న యాపారాలు జేస్తాడు. కూలిపనికి పోడు. ఈ మద్దెనే పదీ పదైదు యేలు కర్సుపెట్టి ఇండ్లు కట్టుకున్నాడు. సిన్న టీ.వీ. తెచ్చుకున్నాడు. కుర్సీ యేసుకోని కూకోని టీ.వీ. సూస్తాడు. అందుకు వర్ధనరెడ్డికీ, రంగారెడ్డికీ వానిమీద కోపం.

"మాదిగె నాకొడుకు! కుర్సీ యేసుకోని దర్జాగా కూకోని టీ.వీ. సూస్తాడు! ఇండ్లు కట్టుకుంటాడా? దొంగతనం సెయ్యకపోతే వానికి యాడ్డి లెక్క?" మాదిగోడు పిట్టగూడంత ఇండ్లు కట్టుకుంటే దొంగోడైపోతే, లచ్చలు కర్సు పెట్టి కింద్దా, పైనా కట్టుకొంటారే వాళ్లు ఏం గావాల?

మాదిగోని పెండ్లాం మీద దౌర్జన్యం జరిపితే, ఇదేమని అడిగినందుకు మాదిగోడే సచ్చిపోయె! రెడ్ల ఇంటామె తనంత తానే మాదిగోన్తో సమందం పెట్టుకుంటే అక్కడా మాదిగోడే సచ్చిపోయె! జోగలోడు పాపం అన్యాయంగా సచ్చిపోలా! నాగసుబ్బారెడ్డి బామర్ది రామిరెడ్డి ఉత్త తాగుబోతు. ఎప్పుడూ టౌన్లోనో పడుంటాడు, ఊళ్లో ఉండే దెప్పుడో! అమ్మా, నాయినా ముసిలోళ్లు. పెండ్లాం లచ్చమ్మ మంచి పాయంలో ఉంది. పిల్ల ల్లేరు. జోగలోడు వాళ్లకు సేద్యానికి పోతా ఉంటాడు. ఆ యమ్మే ముందు సొరవ జేసుండాల, లేకపోతే మాదిగోనికి అంత ధైర్యం యాన్నుంచొస్తాది? ఒకసారి రామిరెడ్డి వచ్చేతలికి ఇద్దరూ ఉన్నారట. వచ్చి బావకు సెప్పుకున్నాడు. జోగలోడు మల్ల కనపల్లా. "మాదిగె లంజా! నేను పిలిస్తే రావా!" అని మాదిగోని పెండ్లాన్ని తిట్టేవాడే, "మాదిగె నాకొడుకా! మా ఆడవాళ్ల దగ్గరికి రాడానికి ఎన్ని గుండె(ల్రా నీకు?" అని తిడ్తాడు.

తెలనోళ్లకైతే ఇంత అన్యాయంగా ఈ కాలంలో, యాడుంటాదిలే అనిపిస్తాది. అదీ నిజమే. మామూలుగా బతికే వాళ్లెవరూ అట్టన్లేరు. జనాన్నీ, తుపాకుల్నీ ఎంటబెట్టుకుని రౌడీతనం సెలాయిచ్చే వాళ్ళు ఏమయినా అంటారు, ఏమయినా సేస్తారు. వాళ్లు మనిసిని నిలువునా కిర్సనాయిలు పోసి కాల్చిచ్చేస్తారు. నరికేయిచ్చి ఏ కాల్వల్లోనో, గుట్టల్లోనో పారేయిస్తారు. ఎమ్మెల్లే సచ్చిపోతే ఎమ్మెల్లే కొడుకు ఎమ్మెల్లే అయినట్టుగానే, నాయకుడు సచ్చిపోతే నాయకుని కొడుకు నాయకు డయితాడు. రంగారెడ్డి దగ్గర అంకని నాయిన కొలువు జేస్తే, నాగసుబ్బారెడ్డి పక్కన అంకడు కట్టిపట్నాడు. ఎవరి నాయన తావులోకి వాళ్లొచ్చినా, వాళ్లెట్టా ఉండారు? ఈళ్లెట్టా ఉండారు? తను సూసిన మాదిగోళ్లందరూ ఏమైపోయిరి? నలబై యాబై యేండ్లకే ముసిలోళ్లయి సచ్చిపోయిరి. వాళ్లు అరవై ఏండ్లోళ్లు మల్లా పెండ్లి జేసుకునేట్టుంటారు! ఈళ్లు బాగుపడితే ఓర్సుకోరు. అతట్టుకు కొందర్నీ, ఈత్తట్టుకు కొందర్నీ సీల్చుత్తారు. ఇద్దరూ కల్సిమల్లా ఈళ్లను అనగతొక్కుతానే ఉంటారు. ఈళ్లు సదువుకొంటే ఓర్సలేరు, సంపాయిచ్చుకుంటే ఓర్సలేరు, ఆకిరికి వాళ్ల తలకాయలు వాళ్లు ఎత్తుకొని సూస్తే ఓర్చలేరు!

ఇంతకుముందు ఊళ్లల్లో మనుసుల మద్దెన నమ్మకా లుండె. ఇప్పుడు ఎవడూ ఎవన్నీ నమ్మలేడు. ఇవతల దిక్కన్నా ఉండాల, అవతల దిక్కన్నా ఉండాల. వాన్దిక్కూ, వాని పెండ్లాం పిల్లల దిక్కూ ఉండడాని కీల్లేదు. ఇంతకు ముందు కూలోళ్లందరూ ఒకటిగా ఉన్నప్పుడు, కూల్తక్కువగా ఉంటే పెంచాలని అడిగేవాళ్లు. ఇప్పుడు ఈ పక్కవాళ్లూ, ఆపక్కవాళ్లూ కల్చేదీ లేదు, అడిగేదీ లేదు. బీదాబిక్కీ ఒకటిగా ఉండకపోతే పెద్దోళ్లకు శానా మేల్లు. కూలి పెంచడమట్టా ఉండనీ వారం రోజుల్నించీ సేనికాడ కట్టబోసిన వాళ్లు

కూలికోసం తిరుగుతా ఉంటే, నాగసుబ్బారెడ్డి దొరకలా, ఇంట్లో వాళ్లేమో నాగసుబ్బారెడ్డి రావాలంటారు. మండు టెండల్లో పస్జేసినోళ్లు పాపం నిన్నట్నుంచీ పిల్లోల్లతో గూడా పస్తులుండారు. ఆయనేమో 'ఇదో వచ్చే, అదో పాయె!' వాళ్ల కూలి సంగతి ఎత్తితే ఎగతాళిగా మాట్లాడతారు. "ఒర్నీ! ఆయ నేదో ఐదరాబాదు నుంచీ వచ్చినోళ్లతో అర్జెంటు పన్లో తిరుగుతాంటె ఈళ్ల కూలి కొచ్చింది!" అని నగినారు. ఆయనదీ, ఆ ఐదరాబాదువాళ్లదీ అర్జెంటు పని! పస్తులుంటున్న వాళ్లకు కూలి అర్జెంటు కాదు. "పాపం, ఎట్టుండారో!"

"ఏంది ఇంగా పండుకోనుండావు! లే! ఇదో....... ఏమబ్బా! వర్దనరెడ్డీ, నాగసుబ్బారెడ్డీ రాజీపడ్తారంట తెల్చునా!" అంది పుల్లి.

ఆ మాటతో సివుక్కున లేసి, "చ!" అన్నాడు. "చా లేదు, చీ, లేదు!" అందులో ఆచ్చెర్యమేమీ లేదు అన్నట్టు పుల్లి అంది.

తను రాత్రంతా ఏదేదో ఆలోచన సేసినాడు. ఏ ఆలోసనా సెయ్యనట్టున్నా, పుల్లికే ఎక్కువ తెల్చినట్టుంది.

"ఎవరు జెప్పినారు నీకు?"

"ఎవురు జెప్పే దేంది? ఊరంతా అనుకుంటాండారు. వర్దనరెడ్డింట్లో బోజినాలంట! యాడ ఉండే కోళ్లనూ పట్టకపోతాండారు!"

అంకని మనసంతా కోళ్లు సిదిగినట్టు అయింది. మీటింగులో వాళ్లు సెప్పినట్టే అయింది. ఎంత కరెట్టుగా సెప్పినారు వాళ్లు!

"సద్ది తాగి పోదూ! బోజనాలు నీక్కాదు!" అంటాంది పుల్లి నగుతా.

అంకడు పలక్కుండా ఈదిలోకి నడ్సినాడు. ఈదిలో బొయ్యేవాళ్లంతా తన మొగం సూసి నగుతా పోతాన్నెట్టుంది.

"ఎర్రినాకొడకా!" అనుకుంటా ఉండారేమో! తనకు తెలకుండానే వర్దనరెడ్డి ఇంటిదిక్కు తిరిగినాడు.

"చ! వర్దనరెడ్డి ఇంటికాడికి ఎట్ట బొయ్యేది!" అనిపిచ్చింది.

దూరంగా నిలబడిపోయినాడు. ఇంటి ముందు గుడ్డ పందిరేసినారు, కుర్చీ లేసినారు.

శానామంది కూకోని 'మాట్లాడుకుంటా ఉండారు. జీపుల్లూ, కార్లూ, మోటారు సైకిళ్లూ దండిగా ఉండాయి. కుర్చీలల్లో నాగసుబ్బారెడ్డీ, వర్దనరెడ్డీ దగ్గర దగ్గరగా కూకోని ఉండారు. ఆయన పక్కన కొందరూ, ఈయన పక్కన కొందరూ ఐదరాబాదోళ్లుండారు. ఒకాయన లేసి మాట్లాడతాండాడు. ఆయనా, ఇంగా ఇద్దరు ముగ్గురూ ఏందేందో మాట్లాడినారు. ఇసయ మేందంటే, మల్లా ఎన్నికలొస్తాండాయి. ఈ సమయంలో ఈల్లిద్దరూ ఇడిఇడిగా ఉండకుండా కల్సి పన్జేయాలనీ, లేకపోతే అవతలోళ్లు వచ్చే ప్రమాదం ఉందనీ, ముఖ్యమంత్రి ముక్కెంగా సెప్పి ఈళ్లను పంపిచ్చినాడంట!'

"ఇద్దరూ రాజీకి ఒప్పుకొన్నందుకు సంతోషంగా ఉంది. ఇంగ మన్దే గెలుపు!" అంటా. అందరూ సప్పట్లు కొట్టుకొన్నారు. వర్దనరెడ్డికీ, నాగసుబ్బారెడ్డికీ పూల్దండ లేసి సేతులు కలిపినారు.

అంకనికంతా నాటకం సూసినట్టుగా ఉంది. అయితే వర్దనరెడ్డీ నాగసుబ్బారెడ్డీ, ఆ వచ్చినోళ్లూ ఏసికాలు యేసుకోలేదు. ఈళ్ల కొట్లాట ఉత్తయా? రాజీ ఉత్తయా? అన్నీ ఉత్తయేనా? మీటింగులో వాళ్లేం జెప్పినారు? అన్నీ ఉత్తయే, వాళ్ల పయోజనాలే నిజమైన యన్నారు. పయోజనాల్లేందే కొట్లాడుకోరు, పయోజనా ల్లేందే రాజీలు పడరు. మరి, తనట్టాటి ఎర్రినాకొడుకుల పయోజనా లేంటియి?

అంకనికి ఎదురుగా వస్తున్న నాగడు కనిపిచ్చినాడు. వాని మొకం కూడా 'ఎర్రి' దైనట్టే ఉండాది. వాడు వర్దనరెడ్డి తట్టూ, తను నాగసుబ్బారెడ్డితట్టూ. ఇద్దరూ ఎదురెదురుగా నిలబడి బాంబు లేసుకున్నారు. బాంబు లేసుకునేదీ, ఏసుకుంటే సచ్చేదీ - అసలు బాంబులు తయారుజేసేదీ, సేసేటప్పుడు మిట్టీకు జరిగితే సచ్చేది ఎవరు? బాంబుల పయోజనాలెవరియి? బాంబుల పెమాదాలెవరియి? బాంబులేసుకున్నప్పుడు తన తొడకు గాయమయింది నెల్రోజులు ఆసుపత్రిలో పడుండి వచ్చినాడు. అప్పుడింగా సిన్నపిల్లోల్లు. పుల్లి నానా సావు సచ్చింది. ఎవరికోసం తను బాంబు లేసినాడో వాళ్లు తన పిల్లల కోసమూ, పెండ్లాం కోసమూ ఏ సాయమూ సెయ్యాలా, అది సెప్పి, తనను తిడతానే ఉంటాది పుల్లి. తనకు తెలివి రాలా!

రంగారెడ్డి "మాదిగోనికి పుట్నోడే మాదిగోని పక్క నుండేది!" అనన్నప్పుడు తెలివి రాలా!

"అవునబ్బా! వాళ్లు మాదిగోళ్లు కాదు కదా! మాదిగోళ్ల పక్క నెందుకుంటార్లే!" అనుకోలా. ఎంగటిని సెయ్యి వట్టి ఈడ్సినప్పుడూ, ఒబిగాన్ని తగలబెట్టి సంపినప్పుడూ

తెలివి రాలా!

"థూ!" అని అంకడు అంకన్నే తిట్టుకుంటా కాండ్రించి ఎంగిలి మూసినాడు. దగ్గరికొచ్చిన నాగడు _ అంకడు 'థూ' అనింది తననేమో అనుకున్నాడు. అనుకోని, అంకని మొకం జూస్తే మల్లా అట్టనిపిచ్చలా.

అప్పుడే అంకడు గూడా నాగని మొకం జూసినాడు. వాళ్లకు సదువు రాదు. అయితే, అప్పుడు ఒకరి మొకం మీద ఉండేది ఒకరు నదువుకోడమే గాదు, బాగా అర్థం కూడా సేసుకున్నారు. అర్తమైనా వాళ్లేం మాట్లాడుకోలా. ఒకరి మీదొకరు బాంబు లిసురుకొన్న ఇద్దరూ సేతులు కలుపుకొన్నారు.

అక్కడ వర్దనరెడ్డీ నాగసుబ్బారెడ్డీ సేతులు కలిపినారు. ఇక్కడ అంకడూ, నాగడూ సేతులు కలిపినారు. అయి పెద్దోళ్ల సేతులు, ఇయిసిన్నోళ్ల సేతులూ కావచ్చు. అయితే, అయి మనుసుల్ని ఇడదీసేటియీ, ఇయి మనుసుల్ని కలిపేటియీ గదా! ఎప్పటికయినా ఇట్టాటి సేతులు కల్పితేనే గదా అట్టాంటి సేతుల ఆట కట్టేది మల్లా!

# -- కథ గురించి. . .

రెండేళ్ళ కిందట అనంతపురం జిల్లా రచయితల సంఘం వారు 'రాయలసీమలో హింస' అన్న వస్తువుపై కథల పోటీ జరపనున్నట్టు ప్రకటించారు. 'రాయలసీమలో హింస' అంటే బావుండలేదనీ, అనిర్దిష్టంగా వుందనీ అనుకున్నాను. ఆ మాటే వారికిరాశాను. ఆ తర్వాత, నేను కూడా రాయలసీమ వాన్నే కదా, రాయలసీమలో 'హింస' ఎటువంటిదో కొంత తెలుసుకదా, అనిర్దిష్టంగా వుందని వాళ్ళకు చెప్పిన వాన్ని ఆ 'నిర్దిష్టత' యేమిటో చెప్పొచ్చుగదా, అనుకుని...... కథ రాసి పంపించాను. దానికి వాళ్లు రెండో బహుమతి ప్రకటించారు. అదలా వుండనిద్దాం.

ఇటువంటి వస్తువుతో వున్న కథని, విమర్శకులు మెచ్చే కథ గానూ, కథా ప్రమాణాలకు నిలిచేది గానూ రాయడం కష్టం. విమర్శకులూ, సంప్రదాయ ప్రమాణాలూ...... అంటే నా ఉద్దేశం సంప్రదాయ విమర్శకులూ, సంప్రదాయ ప్రమాణాలూ అని. సంప్రదాయ విమర్శకులు ఎక్కువగా సమిష్టి జీవిత చిత్రణ కన్నా వ్యష్టి జీవిత చిత్రణను ఇష్టపడతారు. అందులోనూ పాత్రల మనస్తత్వ చిత్రణని మరింత ఇష్టపడతారు. కథా ప్రమాణాలు అన్నవి ఎక్కువగా శిల్పానికి సంబంధించినవి.

ఈ కథలోని పాత్రలూ, వస్తువూ అందుకు అనుకూలమైనవికావు. రాయలసీమ లో పెత్తందారులు జరుపుతున్న హింసను గురించి చదువుకున్న వారిని పాత్రలుగా చేసి విశ్లేషించుకునేలా చేయవచ్చు. వారిమానసిక పరిస్థితులనూ చిత్రించవచ్చు. అయితే, అటువంటి వారు రాయలసీమ 'హింస' లో ప్రత్యక్షంగా ప్రభావానికి లోనవు తున్న వారు కారు. ఎక్కువగా బయటనుంచీ చూస్తున్న వారే అయివుంటారు. ప్రత్యక్షంగా ప్రభావానికి లోనవుతున్న వారు యీ కథలో చెప్పిన వాళ్లే కనుక, వాళ్లను పాత్రలుగా తీసుకోవడమే న్యాయమైనది. భాష, వ్యక్తీకరణ వాళ్లదే వుండాలని వేరే చెప్పనవసరం లేదు.

విమర్శకులూ, కథా ప్రమాణాలను కోరే వారూ మెచ్చే కథను రాయడం కన్నా, వాస్తవ పరిస్థితిని వివరించడం ముఖ్యమనుకున్నాను. రచయిత ప్రాపంచికదృక్పథం ప్రకారమే కథ నడచినా, పాత్రలు తమ అనుభవాల ప్రాతిపదికపైనే గ్రహింపు కొచ్చినట్టు చెప్పడానికి ప్రయత్నించాను.